సాక్షి
నిజామాబాద్
శనివారం, 19, అక్టోబర్, 2024



వాలీబాల్ ఎంపికలు
కమ్మర్‌పల్లి జోనల్ స్థాయి అండర్–17 బాలబాలికల వాలీబాల్ జట్లను శుక్రవారం ఎంపిక చేశారు.
- 8లో ▸



అద్దె భవనాల్లో..
కొత్తగా ఏర్పాటైన మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య కొనసాగుతున్నాయి.
- 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 37.9 /22.4
ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ఇంటర్ సిలబస్ పూర్తి చేయాలి



నిజామాబాద్ అర్బన్: ఇంటర్ సిలబస్ వేగంగా పూర్తి చేయాలని ఇంటర్ విద్యాధికారి రవికుమార్ సూచించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో బోధనపై శుక్రవారం నగరంలోని తన కార్యాలయంలో ఆయన సమీక్షించారు. ప్రతి విద్యార్థి కాలేజీకి హాజరు అయ్యేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో కాలేజీల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న మంచిప్ప ప్రాజెక్ట్ సర్వే



మోపాల్: మండలంలోని మంచిప్ప ప్రాజెక్ట్ సర్వే ఇరిగేషన్ డీఈ గంగాధర్ నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం మూడో రోజు కొనసాగింది. ఒక పక్క ముంపు బాధితులు సర్వేను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తుండగా, అధికారులు వారిని సముదాయిస్తునే సర్వేను కొనసాగిస్తున్నారు. మరో రెండు, మూడ్రోజుల్లో సర్వే పూర్తవుతుందని, వారం రోజుల్లో ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తామని డీఈ గంగాధర్ నాయక్ తెలిపారు. కాగా సర్వేపై అనేక సందేహాలు ఉన్నాయని, వాటిని చేశాకే సర్వే చేపట్టాలని ముంపు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే భూపతిరెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పాత డిజైన్ ప్రకారమే పనులు కొనసాగుతాయని స్పష్టం చేసిన విషయాన్ని ఈసందర్భంగా గుర్తు చేశారు. కానీ ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయకుండా సర్వే కొనసాగించాలని అధికారులను పురమాయించడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని ముంపు ప్రాంతాల ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసిన స్పష్టత ఇవ్వాలని కోరారు.

చిక్లీలో ఒకరికి డెంగీ



మాక్లూర్: మండలంలోని చిక్లీ గ్రామంలో యంచ రాజేశ్వర్ అనే వ్యక్తికి డెంగీ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. రాజేశ్వర్‌కు మూడు రోజులుగా తీవ్ర జ్వరం రావటంతో శుక్రవారం మండల వైద్యాధికారులు గ్రామంలో పర్యటించారు. డెంగీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. పారిశుధ్య సిబ్బందితో గ్రామంలో దోమల మందు పిచికారి చేయించారు.

డెంగీ నియంత్రణకు చర్యలు చేపట్టాలి



నిజామాబాద్ నాగారం: డెంగీ నియంత్రణకు చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ సూచించారు. కీటక జనిత వ్యాధుల నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాలోని సబ్ యూనిట్ అధికారులకు స్ప్రే మిషన్లు పంపిణీ చేశారు. నగరంలోని పీవోడీటీటీ వద్ద 11 స్ప్రేయర్లను డీఎంహెచ్‌వో అందజేసి మాట్లాడారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా యాంటీ లార్వా స్ప్రే పిచికారి చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో కీటక జనిత వ్యాధుల నియంత్రణ అధికారి తుకారాంరాథోడ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజన, ఏఎంవో సలీం, శంకర్, రాజేందర్ పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

నిజామాబాద్ నాగారం: జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించడానికి శనివారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి మధుసూదన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. టీంలీజ్ కంపెనీలో క్యాషియర్, ప్యాకెర్స్, సేల్స్ అసోసియేట్స్, పార్ట్‌టైం, ఫుల్‌టైం జాబ్‌లు ఉన్నాయన్నారు. పదో తరగతి, ఇంటర్ పాసై 26 సంవత్సరాలలోపు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ఒరిజినల్ ధ్రువపత్రాలతో నగరంలోని శివాజీ నగర్‌లో గల ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఉదయం 10.30గంటలకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 9581768413, 9948748428 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కొత్త వీసీకి అనేక సవాళ్లు



యాదగిరిరావు, తెయూ వీసీ

తెలంగాణ యూనివర్సిటీకి కొత్తగా నియామకమైన వైస్ చాన్స్‌లర్ టి యాదగిరిరావు ముందు అనేక సవాళ్లు నిలవనున్నాయి. గత వీసీతో కలిసి అనేక అవకతవకలకు పాల్పడిన మాజీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్లను ఇద్దరినీ సస్పెండ్ చేయాలని పాలకమండలి తీర్మానం చేసింది. అయితే ఇప్పటి వరకు అమలు కాలేదు. గత 16 నెలలుగా తెలంగాణ వర్సిటీలో ఇన్‌చార్జి వీసీల పాలనతో అంతా అస్తవ్యస్తంగా మారింది.

- 16 నెలలుగా తెలంగాణ వర్సిటీలో ఇన్‌చార్జి వీసీల పాలన
- అంతకుముందు రెండేళ్లపాటు వీసీ రవీందర్‌గుప్తా హయాంలో అంతా అస్తవ్యస్తం
- గత పాలకమండలి తీర్మానాల అమలుకు దిక్కులేని వైనం
- అక్రమ నియామకాలు, పీహెచ్‌డీ ప్రవేశాలు
- 2014 వివాదాస్పద నియామకాలపై పకడ్బందీగా వెళ్లకపోతే తప్పని తిప్పలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: తెలంగాణ యూనివర్సిటీకి ఎట్టకేలకు రెగ్యులర్ వైస్ చాన్స్‌లర్‌ను నియమించారు. 2023 జూన్ 17న అప్పటి వీసీగా ఉన్న రవీందర్‌గుప్తా ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడినప్పటి నుంచి ఇన్‌చార్జిల పాలనే నడుస్తోంది. దీంతో అంతా గందరగోళంగా తయారైంది. కాగా రవీందర్ గుప్తా హయాంలో వర్సిటీ పరువు బజారుపాలైంది. 120 మందికి పైగా అవుట్ సోర్సింగ్ పద్ధతిలో అక్రమ నియామకాలు, పీహెడీలకు సంబంధించి అక్రమంగా చేసిన ప్రవేశాలు, 2014 వివాదాస్పద నియామకాలకు సంబంధించి హైకోర్టులో ఉన్నప్పటికీ ఆయా ఫైళ్లను నిబంధనలకు విరుద్ధంగా మూవ్ చేయడంతో పాటు ఇతర పలురకాల అంశాలు వర్సిటీలో చోటు చేసుకున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి సైతం తలనొప్పిగా మారిన పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి అనేక అంశాలు కొత్తగా రానున్న వైస్ చాన్స్‌లర్ టి యాదగిరి రావుకు సవాళ్లుగా నిలవనున్నాయి. పైన చెప్పిన అంశాలతో పాటు అనేక కీలక అంశాలు, గత పాలకమండలి తీర్మానాలు సైతం అమలు చేయక పోగా అలాగే ఉన్నాయి. పరీక్షల విభాగంలో గందరగోళ పరిస్థితుల నుంచి మొదలు ఇలాంటి అనేక వ్యవహారాలను చక్కబెట్టాల్సిన బాధ్యత కొత్త వీసీపై పడనుంది.

■ గత వీసీతో పాటు ఇద్దరు ఇన్‌చార్జి రిజిస్ట్రార్లు పాల్పడిన అవకతవకలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రికార్డులు స్వాధీనం చేసుకుని విచారణ చేస్తోంది. ఒక రిజిస్ట్రార్ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ఉన్న సమయంలో సెల్ఫ్ చెక్కుల ద్వారా తీసుకున్న ఖర్చుల వివరాలు చూస్తే విస్తుపోవాల్సిందే. కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం పేరిట ఏకంగా రూ.11 లక్షలు డ్రా చేసుకోవడం విశేషం. మరోసారి ఏకంగా మొత్తం రూ.15.21 లక్షలు డ్రా చేసుకోవడం గమనార్హం. ఇంకా అనేకం వెలుగు చూస్తున్నాయి.

■ వీసీతో కలిసి అనేక అవకతవకలకు, ఆర్థిక అక్రమాలకు పాల్పడిన మాజీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్లను ఇద్దరినీ సస్పెండ్ చేయాలని పాలకమండలి తీర్మానం చేసినప్పటికీ ఇప్పటి వరకు అమలు చేయలేదు. ఎలాంటి అడ్డంకులు లేకున్నప్పటికీ ఈ తీర్మానాలు అమలు కాలేదు.

పైగా ఎవరినైతే సస్పెండ్ చేయా లని పాలకమండలి తీర్మానం చేసిందో ఆ వ్యక్తినే అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్‌గా కొనసాగించారు. అదేవిధంగా విచ్చలవిడిగా నిధులు దుర్వినియోగం చేసిన గత ముగ్గురు రిజిస్ట్రార్ల నుంచి రికవరీ చేయాలని పాలకమండలి నిర్ణయించింది.

వైస్ చాన్స్‌లర్‌గా యాదగిరిరావు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఐదవ శాశ్వత వైస్ చాన్స్‌లర్‌గా టి యాదగిరిరావు నియామకమయ్యారు. ఈయన ప్రస్తుతం కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్‌గా కొనసాగుతున్నారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం నల్లబెల్లి ఈయన స్వగ్రామం. కేయూలో 1988 లో పీజీ, 1992లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. యాదగిరిరావు కేయూ దూర విద్యాకేంద్రంలో తొలి ఉద్యోగి. 1996లో కేయూలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియామకమయ్యారు. 2005లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2011 లో ప్రొఫెసర్‌గా పదోన్నతులు పొందారు. ప్రస్తుతం 2021 నుంచి సీనియర్ ప్రొఫెసర్‌గా కొనసాగుతున్నారు. బోధన, పరిశోధనా రంగంలో 33 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం ఉంది. కేయూలో అధ్యాపకుడిగా 28 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారు. పీహెచ్‌డీ లో 21 మంది పరిశోధక విద్యార్థులకు, ఎంఫిల్ లో 9 మందికి గైడ్ గా వ్యవహరించారు.

కాకతీయ యూనివర్సిటీ యూజీసీ కోఆర్డినేటర్‌గా, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతిగా, బీవోఎస్ చైర్‌పర్సన్‌గా పలు అడ్మినిస్ట్రేటివ్, అకడమిక్ పదవులు నిర్వహించారు. తెలంగాణ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ సాంబయ్య హయాంలో ప్రొఫెసర్ యాదగిరిరావు తెయూ సోషల్ సైన్స్ డీన్‌గా రెండున్నరేళ్లపాటు పని చేశారు. ప్రస్తుతం పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం బీవోఎస్ చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు.

పిల్లలకు సత్ప్రవర్తన నేర్పాలి



మాట్లాడుతున్న గణపతి సచ్చిదానంద స్వామీజీ

- ఆధ్యాత్మిక చింతనతోనే మోక్షం
- దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి

నిజామాబాద్ రూరల్: పిల్లలకు సత్ ప్రవర్తన నేర్పాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి అన్నారు. నగరంలోని గంగస్థాన్–2లో ఉత్తర తిరుమతి ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాదం, కల్యాణ మండపాన్ని శుక్రవారం స్వామీజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భగవంతుని కృప ఉంటే అన్నీ ఉన్నట్లేనని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక చింతనతోనే మోక్షం లభిస్తుందన్నారు. నిత్యం భగవాన్ నామాన్ని స్మరించాలని సూచించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

స్వామీజీని దర్శించుకున్న పీసీసీ చీఫ్

ఉత్తర తిరుపతి క్షేత్రంలో గణపతి సచ్చిదానంద స్వామీజీని పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్తర తిరుపతి క్షేత్రం అద్భుతమని, ఇలాంటి కేంద్రాలు మానసిక ప్రశాంతతను ఇస్తాయన్నారు. నగరానికి స్వామీ జీ రావడం సంతోషంగా ఉందన్నారు. 1997లో మొదటిసారి గణపతి సచ్చిదానంద స్వామివారిని కలిశానని గుర్తు చేసుకున్నారు. అప్పటి నుంచి వారితో అనుబంధం ఉందన్నారు. ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బాల్కొండ ఇన్‌చార్జి ము త్యాల సునీల్‌రెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, శేఖర్‌గౌడ్, విపుల్‌గౌడ్, శ్రీనివాస్, బొబ్బిలి రామకృష్ణ, కాండికంటి నరేందర్, మహేందర్ పాల్గొన్నారు.

సీపీ కల్మేశ్వర్ బదిలీ

- బెటాలియన్ కమాండెంట్ రోహిణి ప్రియదర్శిని సైతం..
- కేంద్ర సర్వీసుల్లోకి వెళ్లిన భార్యాభర్తలు



సీపీ కల్మేశ్వర్



కమాండెంట్ రోహిణి ప్రియదర్శిని

ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్‌తోపాటు ఆయన సతీమణి డిచ్‌పల్లిలోని ఏడో బెటాలియన్ కమాండెంట్ రోహిణి ప్రియదర్శిని బదిలీ అయ్యారు. వారిని బదిలీ చేస్తూ శుక్రవారం సీఎస్ శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. గతేడాది అక్టోబర్ 13న శాసనసభ ఎన్నికల సందర్భంగా కేంద్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు సీపీగా కల్మేశ్వర్ బాధ్యతలు చేపట్టారు. శాసనసభ, పార్లమెంట్ ఎన్నికలు సజావుగా పూర్తి చేశారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత సీపీ కల్మేశ్వర్ అప్పటి ఐజీ రంగనాథ్, డీజీపీ రవిగుప్తాలను కలిసి బదిలీ చేయాలని కోరినట్లు తెలిసింది. అయితే జిల్లాలో సీపీ తీసుకొచ్చిన సంస్కరణలతో లా అండ్ ఆర్డర్ పటిష్టంగా ఉందని బదిలీ చేయలేమని వారు చెప్పినట్లు పోలీస్ వర్గాలలో చర్చ జరిగింది. సీపీ సతీమణి ఐపీఎస్ అధికారిణి రోహిణి ప్రియదర్శినిని హైదరాబాద్ నుంచి డిచ్‌పల్లిలోని బెటాలియన్ కమాండెంట్‌గా నియమించారు. ఆమె సుమారు ఆరు నెలలపాటు పని చేశారు. తాజాగా వారిద్దరిని కేంద్ర సర్వీసులైన నేషనల్ పోలీస్ అకాడమీలో అసిస్టెంట్ డైరెక్టర్లుగా బదిలీ చేశారు. వారు త్వరలోనే రిలీవ్ కానున్నట్లు తెలిసింది.

శాసనసభ ఎన్నికల తర్వాత నుంచి ప్రచారం

శాసనసభ ఎన్నికల సమయంలో అప్పటి సీపీ సత్యనారాయణపై ఫిర్యాదులు వెళ్లడంతో ఎన్నికల సంఘం బదిలీ చేసింది. ఆయన స్థానంలో కల్మేశ్వర్ సీపీగా బాధ్యతలు స్వీకరించారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత సీపీ బదిలీపై చర్చ జరిగింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనను కొనసాగించింది. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బదిలీ జరుగుతుందని భావించినా జరగలేదు. ఐజీ రంగనాథ్, డీజీపీ రవిగుప్తా బదిలీ కావడంతో కేంద్ర సర్వీసులకు డిప్యూటేషన్‌పై వెళ్లడానికి సీపీ కల్మేశ్వర్ ఆయన సతీమణి ప్రియదర్శిని దరఖాస్తు చేసుకున్నారు. నెల రోజులుగా బదిలీలపై చర్చ జరుగుతుండగా శుక్రవారం వచ్చిన ఉత్తర్వులతో తెర పడింది.

సీపీగా శ్వేతారెడ్డి!

నిజామాబాద్ పోలీస్ కమిషనర్‌గా శ్వేతారెడ్డి రానున్నట్లు సమాచారం. ఆమె గతంలో కామారెడ్డి ఎస్పీగా పని చేశారు. అప్పుడే నిజామాబాద్ సీపీగా వస్తారనే ప్రచారం జరిగింది. అప్పుడు సీపీగా కేఆర్ నాగరాజు వచ్చారు. సీపీ కల్మేశ్వర్ బదిలీ కావడంతో మళ్లీ ఆమె వస్తారని ప్రచారం జరుగుతోంది. ఆమెతో పాటు మరో ముగ్గురు పేర్లు తెరపైకి వస్తున్నట్లు సమాచారం.



ప్రమాదకరంగా గ్యాస్ ఫిల్లింగ్

నగరంలోని పూలాంగ్ రైతు బజార్ వద్ద ఓ వ్యక్తి ప్రమాదకరంగా సిలిండర్ నుంచి కారులో గ్యాస్ నింపాడు. డొమెస్టిక్ సిలిండర్ గ్యాస్‌ను ఇలా కారులో నింపడంతో ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.
– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

గ్రూప్ -2, 3 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- వీడియో కాన్ఫరెన్స్‌లో టీజీపీఎస్‌సీ చైర్మన్ మహేందర్ రెడ్డి సమీక్ష



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు. అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, సీపీ కల్మేశ్వర్

నిజామాబాద్‌అర్బన్: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్‌సీ) ద్వారా నవంబర్ 17, 18 తేదీలలో గ్రూప్–3 , డిసెంబర్ 15, 16 తేదీలలో గ్రూప్–2 రాత పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. టీజీపీఎస్‌సీ చైర్మన్ ఎం మహేందర్ రెడ్డి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లు, పోలీస్ అధికారులు, నోడల్ ఆఫీసర్లు, ప్రాంతీయ సమన్వయకర్తలతో పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. పరీక్షలు ఎలాంటి లోటుపాట్లకు ఆస్కారం లేకుండా, ప్రశాంత వాతావరణంలో సాఫీగా జరిగేలా చూడాలన్నారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ.. గ్రూప్–2, గ్రూప్–3 పరీక్షల కోసం జిల్లాలో మొత్తం 72 పరీక్ష కేంద్రాలను గుర్తించామన్నారు. ఇప్పటికే ఆర్డీవోలు ఈ కేంద్రాలను సందర్శించి వసతి సదుపాయాలను పరిశీలించారని తెలిపారు. గ్రూప్స్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు, ఇతర మెటీరియల్‌ను భద్రపరిచేందుకు ఐడీవోసీలో ఒకటి, పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో మరొకటి మొత్తం రెండు స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఈ నెల 22 లోపు స్ట్రాంగ్ రూమ్‌లకు సంబంధించిన పూర్తి వివరాలను సమర్పిస్తామని, పరీక్ష కేంద్రాల వివరాలను కూడా ఆన్‌లైన్ ద్వారా పంపిస్తామ ని అన్నారు. ఎక్కువ సంఖ్యలో అభ్యర్థులు పరీక్షల కు హాజరుకానున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా సిబ్బందిని నియమిస్తామని, అవసరమైతే ఇ తర శాఖల సహకారం తీసుకుంటామన్నారు. వీడి యో కాన్ఫరెన్స్‌లో పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, అదనపు డీసీపీ బస్వారెడ్డి, ప్రాంతీయ సమన్వయకర్తలు రాంమోహన్ రావు, సాయిరెడ్డి, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్ పాల్గొన్నారు.

పైరవీల కోసం ఠాణాలకు వెళ్తే బైండోవరే!

- సుమారు 65 మందిపై చర్యలకు పోలీసులు సిద్ధం
- జిల్లాలోని పోలీస్‌స్టేషన్లకు చేరిన జాబితా

ఖలీల్‌వాడి : పోలీస్ స్టేషన్లలో పైరవీలు చేయడానికి వచ్చే వారిపై చర్యలు ఉన్నతాధికారులు సిద్ధం అవుతున్నారు. వారిని బైండోవర్ చేయాలని నిర్ణయించారు. పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేయడానికి వెళ్లే బాధితులు చాలా వరకు స్థానిక నాయకులు, పోలీసులు సంబంధాలు ఉన్న వారిని వెంట తీసుకెళ్తారు. వారు ఠాణాలకు వెళ్లి పోలీసులకు ఎంతో కొంత ముట్టజెప్పుతారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చే పైరవీకారులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయాలని నిర్ణయించారు. పైరవీకారుల జాబితాను జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లకు పంపించారు. ఆ జాబితా ప్రకారం పోలీసులు బైండోవర్ చేయడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

పోలీసులతో సంబంధాలు పెరగడానికి..

ప్రజలు నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడానికి ఈ విధానం అమలు చేస్తున్నట్లు సమాచారం. కొన్ని సందర్భాల్లో తమ వైపు న్యాయం ఉన్నప్పటికీ లోకల్ లీడర్లు, పైరవీకారులతో సామాన్య ప్రజలకు అన్యాయం జరుగుతోంది. దీంతో పోలీసులు, ప్రజల మధ్య సంబంధాలు పెరగడానికి ఈ విధానం అమలు చేస్తు న్నారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్లకు వస్తున్న పైరవీకారులు, నాయకుల వివరాలను నిఘా వర్గాల ద్వారా పోలీస్ అధికారులు సేకరించినట్లు సమాచారం. అయితే పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ బదిలీతో బైండోవర్లు జరుగుతా యా లేదా అనే అనుమానాలు తలెత్తున్నాయి.

పార్టీలకతీతంగా..

పోలీస్‌స్టేషన్‌లకు రెగ్యులర్‌గా వివిధ పనులపై వెళ్తున్న పైరవీకారుల, నాయకుల జాబితాను పోలీస్‌శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది పంపించినట్లు తెలుస్తోంది. జిల్లాలోని కొన్ని పోలీస్‌స్టేషన్లకు ముగ్గురు నుంచి ఐదుగురి పేర్ల జాబితా వెళ్లినట్లు సమాచారం. పార్టీలకు అతీతంగా ఈ జాబితాను రూపొందించినట్లు తెలిసింది. ఈ జాబితా ప్రకారం ఇప్పటికే కొందరిని బైండోవర్ చేశారు.



ఏటీసీలతో మెరుగైన ఉపాధి అవకాశాలు

- ఈ నెలాఖరు వరకు ప్రవేశాలకు అవకాశం
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నిజామాబాద్ అర్బన్: మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు (ఏటీసీ) దోహదపడతాయని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. యువతలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నెలకొల్పిన ఏటీసీల్లో ప్రవేశాలపై శుక్రవారం ఉపాధి కల్పన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సంజయ్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఏటీసీలను అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని, ఈ నెలాఖరులోపు పూర్తి స్థాయిలో ప్రవేశాలు జరిగేలా చొరవ చూపాలని సూచించారు. వీసీ అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులతో సమావేశమై దిశానిర్దేశం చేశారు. ప్రవేశాల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఏటీసీ కేంద్రాలలో శిక్షణ ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. తొలి విడతగా జిల్లాలో నిజామాబాద్, బోధన్, కమ్మర్‌పల్లిలో ఏటీసీ కేంద్రాలను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణాల్లోనే ఏటీసీ కేంద్రాలను కొనసాగిస్తూ, ఆయా కోర్సులలో శిక్షణను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ నెల 31లోగా ప్రవేశం పొందాలని సూచించారు. అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, జిల్లా కార్మిక శాఖ అధికారి యోహాన్, స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్, సంబంధిత ఐటీఐ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

క్లుప్తంగా

పోలీస్ అమరుల కుటుంబాలకు సీపీ పరామర్శ



ఖలీల్‌వాడి: పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కమిషనరేట్ పరిధిలో అమరులైన పోలీసు కుటుంబ సభ్యులను సీపీ కల్మేశ్వర్ పరామర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది వారి కుటుంబసభ్యులను కలిసి అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రభుత్వం నుంచి అందిన సహాయ సహకారాల గురించి అడిగి తెలుసుకున్నారు. అమరులైన పోలీస్ కుటుంబాలకు అధికారులు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని, వారి బాగోగులు పర్యవేక్షించాలన్నారు. అదనపు డీసీపీ కోటేశ్వరరావు, ఎస్‌బీ సీఐ, ఎస్ సత్య ప్రసాద్, టౌన్ సీఐ శ్రీనివాస్‌రాజ్ పాల్గొన్నారు.

వరద కాలువ ద్వారా నీటి విడుదల

బాల్కొండ: ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా ప్రాజెక్ట్ అధికారులు శుక్రవారం నీటి విడుదలను చేపట్టారు. ప్రాజెక్ట్ నుంచి 5 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. గురువారం ప్రాజెక్ట్‌లోకి వరద పెరగడంతో వరద గేట్లను ఎత్తి గోదావరిలోకి నీటి విడుదల చేపట్టారు. శుక్రవారం మధ్యాహ్నం మరింత వరద పెరిగి 23 వేల క్యూసెక్కులకు పెరిగింది. దీంతో వరద కాలువ ద్వారా నీటి విడుదలను ప్రారంభించారు. కాకతీయ కాలువ ద్వారా 5800 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 2200, రెండు వరద గేట్ల ద్వారా 6248, సరస్వతి కాలువ ద్వారా 500, లక్ష్మి కాలువ ద్వారా 150, ఆవిరి రూపంలో 571, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీటి విడుదల జరుగుతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా శుక్రవారం సాయంత్రానికి అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్ట్ నిండుకుండల ఉంది.

20న చెస్ ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20న అండర్–15 విభాగంలో బాలబాలికలకు చెస్ ఎంపికలు నిర్వహించనున్నట్లు కార్యదర్శి రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని అభ్యాస స్కూల్‌లో ఎంపికలు ఉంటాయని, 01.01.2009 తర్వాతా పుట్టిన వారు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 94400 07004 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

అద్దె భవనాల్లో కార్యాలయాలు

- ఎనిమిదేళ్లుగా అరకొర వసతుల మధ్యే నిర్వహణ
- నూతన మండలాల్లో కార్యాలయాలకు సొంత భవనాలు కరువు
- నిధులు కేటాయించని ప్రభుత్వం



అద్దె భవనంలో కొనసాగుతున్న ఏర్గట్ల తహసీల్ కార్యాలయం

మోర్తాడ్: మండలాల పునర్విభజన జరిగి ఎనిమిదేళ్లు గడిచినా అద్దె భవనాలు, కమ్యూనిటీ హాళ్లలోనే ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణ సాగుతోంది. అరకొర సౌకర్యాల మధ్య పాలన కొనసాగించాల్సిన పరిస్థితి నెలకొంది. సరైన వసతులు లేక ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. 2016లో దసరా రోజున ఏర్గట్ల, మెండోరా, ముప్కాల్, ఇందల్వాయి, మోపాల్, రుద్రూర్, నిజామాబాద్ దక్షిణ, ఉత్తర మండలాలు, మండలాలను ప్రారంభించారు. ఆ తర్వాత మోస్రా, చందూర్, ఆలూర్, సాలూర, డొంకేశ్వర్ మండలాలను ఏర్పాటు చేశారు. తహసీల్, మండల పరిషత్, మండల విద్యాశాఖ, ఐకేపీ, ఉపాధి హామీ, పోలీసు స్టేషన్లను అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. మండల కేంద్రాల్లో అనువైన స్థలాలను ఆయా గ్రామ కమిటీలు, ప్రజాప్రతినిధులు చూయిస్తే సొంత భవనాలను నిర్మిస్తామని ప్రభుత్వం వెల్లడించింది. స్థలాల సేకరణ చేసిన చోట నిధులను కేటాయించకపోవడంతో సొంత భవనాల నిర్మాణాలకు అడుగులు ముందుకు పడలేదు. కొన్ని మండలాల్లో కేజీబీవీలకు సొంత భవనాల నిర్మాణం సాగింది. అద్దె భవనాలు, కమ్యూనిటీ హాళ్లు, వినియోగించని పాఠశాలల భవనాల్లోనే ప్రభుత్వ కార్యాలయాలను కొనసాగిస్తున్నారు. ఏళ్ల తరబడి అరకొర వసతుల మధ్యే ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణ సాగుతుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిపాలనా సౌలభ్యం కోసం మండలాలను విభజించినా కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించకపోవడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను ఈ ప్రభుత్వం చేయకుండా అన్ని కార్యాలయాలకు సొంత భవనాల నిర్మాణంపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

భవనాలను నిర్మించాలి



ప్రజల ఆశలను నెరవేరుస్తూ కొత్త మండలాలను ఏర్పాటు చేశారు. సొంత భవనాల నిర్మాణంపై దృష్టి సారించి ప్రజలకు సౌకర్యాలను చేరువ చేయాలి. మండలాల పునర్విభజన కళ సాకారమైనా సొంత భవనాలు లేకపోవడం సరికాదు.

– కొలిప్యాక ఉపేంద్ర, మాజీ ఎంపీపీ, ఏర్గట్ల

నిధులు మంజూరు చేయాలి



కొత్త మండలాల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించ డానికి నిధులను విడుదల చేయాలి. అన్ని కార్యాలయాలు ఒకే చోట ఉంటే ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. స్థల సేకరణ చేపట్టి సొంత భవనాల నిర్మాణం ఆరంభించాలి.

– తోకల నర్సయ్య, మాజీ సర్పంచ్, తాళ్లరాంపూర్

నిజామాబాద్ సౌత్ ఎఫ్‌ఆర్‌వో కార్యాలయం మార్పు



కార్యాలయ సామగ్రిని ఆటోలో తరలిస్తున్న సిబ్బంది

మోపాల్: మండలంలోని ముదక్‌పల్లి శివారులో ఉన్న గుడి తండా జీపీ పరిధిలో కొనసాగుతున్న నిజామాబాద్ సౌత్ రేంజ్ అటవీశాఖ కార్యాలయాన్ని(ఎఫ్ఆర్‌వో) నగరంలోని హెడ్‌క్వార్టర్స్‌కు మార్చారు. ఈ మేరకు శుక్రవారం సౌత్ కార్యాలయంలోని సామాగ్రిని తరలించారు. నాలుగు నెలల క్రితమే నిజామాబాద్ సౌత్ అటవీశాఖ కార్యాలయాన్ని ముదక్‌పల్లి శివారులో ఉన్న గుడితండా జీపీ పరిధిలోకి మార్చారు. మళ్లీ కార్యాలయం మార్పు చేస్తుండటంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అనివార్య కారణాలతో కార్యాలయాన్ని నగరంలోని హెడ్‌క్వార్టర్స్‌కు మార్చుతున్నట్లు సిబ్బంది పేర్కొంటున్నారు. కానీ రేంజ్ కార్యకలాపాలు ఇక్కడే నుంచే కొనసాగుతాయని మరికొంతమంది సిబ్బంది చెబుతుండడం గమనార్హం.

ఎస్‌వోపై విచారణ చేపట్టాలని ఫిర్యాదు



నిజామాబాద్‌అర్బన్: మాక్లూర్ కేజీబీవీ ఎస్‌వోపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ టీపీటీఎఫ్ తరగతి వర్కర్స్ యూనియన్ నాయకులు కలెక్టరేట్ ఏవోకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఎస్‌వోపై వరుసగా వస్తున్న ఆరోపణలపై విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని లేదంటే ఆందోళనలు చేపడతామని అన్నారు. వినతిపత్రం అందించిన వారిలో టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సల్ల సత్యనారాయణ, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, నాయకులు ఉన్నారు.

సిర్నాపల్లిలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు



ఇందల్వాయి: మండలంలోని సిర్నాపల్లిలో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–17, 14 బాలబాలికల విభాగంలో కబడ్డీ పోటీలను శుక్రవారం నిర్వహించారు. రెండు విభాగాల్లో బాలబాలికలకు చెందిన 56 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. అండర్–14 బాలుర విభాగంలో మొదటి స్థానంలో సిర్నాపల్లి జట్టు, రెండో స్థానంలో డిచ్‌పల్లి జట్లు నిలిచాయి. బాలికల విభాగంలో బాల్కొండ, సిర్నాపల్లి మొదటి రెండు స్థానాల్లో, అండర్–17 బాలుర విభాగంలో సిర్నాపల్లి, కమ్మర్‌పల్లి జట్లు వరుసగా మొదటి రెండు స్థానాలో, బాలికల విభాగంలో ధర్పల్లి, భీమ్‌గల్ జట్లు మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి. పోటీల్లో ముఖ్య అతిథులుగా తహసీల్దార్ వెంకట్రావు, ఎస్సై మనోజ్ కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మణ్‌రెడ్డి, వీడీసీ అధ్యక్షుడు అశోక్, సభ్యులు పాల్గొన్నారు.

జోనల్ స్థాయి వాలీబాల్ ఎంపిక పోటీలు



వాలీబాల్ జోనల్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కమ్మర్‌పల్లి జోనల్ జట్టు ఎంపిక కోసం వాలీబాల్ క్రీడాపోటీలు నిర్వహించారు. వాలీబాల్ అండర్–17 బాలుర, బాలికల విభాగంలో ఎంపిక పోటీలు నిర్వహించగా, కమ్మర్‌పల్లి, మోర్తాడ్, ఏర్గట్ల మండలాల పరిధిలోని పాఠశాలల విద్యార్థులు పాల్గొని తమ క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించారు. ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులను కమ్మర్‌పల్లి జోనల్ జట్టుకు ఎంపిక చేశారు. జోనల్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు శనివారం జిల్లా కేంద్రంలోని డీఎస్‌ఏ మైదానంలో నిర్వహించే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీ నాగభూషణం తెలిపారు. ఎంఈవో ఆంద్రయ్య, హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య, పీఈటీలు శ్యామ్, మాధురి, సింధు, బాలు, అజయ్, రాజు, రాజేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు వీరే..

బాలుర విభాగంలో జి అభినవ్, సీహెచ్ సాగర్, బి శ్రీమాన్, ఎల్ రాజ్‌కుమార్, సీహెచ్ వికాస్, కె రాకేశ్, ఎస్ రిషివర్ధన్, ఎం నిధిత్, ఈ విఘ్నేశ్, టి విక్కీ, బి సాయినాథ్, జి సచిన్, జి దీక్షిత్, ఆర్ రవిచరణ్, ఎ బాలనితీశ్, బాలికల విభాగంలో ఎ వైష్ణవి, ఎం సుప్రియ, పి లోహిత, జె రవి, ఎం జయశ్రీ, టి శరణ్య, జె శాలిని, బి మోహిత, టి శిరీష, ఎస్ పొలస్య, జి నందిని, జె శ్రీజ, ఎల్ గీతిక, సీహెచ్ శ్రీభవ్య, ఎం రచిత, కె వర్ధిని, కె గంగాదేవి ఉన్నారు.

జిల్లా సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపిక



ఎంపికైన జిల్లా క్రీడాకారులు

డిచ్‌పల్లి: వరంగల్‌లో ఈ నెల 18 నుంచి 20వరకు జరుగుతున్న 9వ రాష్ట్ర సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికై న క్రీడాకారులు శుక్రవారం ఉదయం బయల్దేరినట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి ప్రభాకర్ రెడ్డి, మార్కంటి గంగామోహన్ తెలిపారు. నాలుగు రోజులుగా సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల సుద్దపల్లిలో నిర్వహించిన శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాఠశాల ప్రిన్సిపాల్ తీగుళ్ల నళిని విచ్చేసి మాట్లాడారు. శారీరక, మానసిక ఎదుగుదలను ఉత్తేజపర్చే క్రీడలు పిల్లలకు చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో పాఠశాల సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ మైనేని స్వప్న, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ వనిత, సాఫ్ట్‌బాల్ అకాడమీ కోచ్ మౌనిక, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు శ్రీలత, సీనియర్ క్రీడాకారులు భుల బాయి, సౌమ్యరాణి పాల్గొన్నారు.

ఆర్మూర్ ఏఎంసీ పాలకవర్గం ఖరారు!

- చైర్మన్‌గా సాయి బాబా గౌడ్
- వైస్ చైర్మన్‌గా ఇట్టెం జీవన్



సాయిబాబా గౌడ్



ఇట్టెం జీవన్

ఆర్మూర్: ఎట్టకేలకు ఆర్మూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ఎంపిక ప్రక్రియ పూర్తయింది. బీసీ జనరల్ రిజర్వేషన్ ఉన్న చైర్మన్ పదవికి చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ పట్టణ అధ్యక్షుడు సాయిబాబా గౌడ్, వైస్ చైర్మన్‌గా మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఇట్టెం జీవన్‌తో పాటు పది మంది డైరెక్టర్ల పేర్లు ఖరారయ్యాయి. అధికారిక ఉత్తర్వులు వెలువడడమే మిగిలింది. ఆర్మూర్ వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలో ఆర్మూర్ నియోజకవర్గ పరిధిలోని ఆర్మూర్ పట్టణం, ఆర్మూర్ మండలంతో పాటు నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ పరిధిలోని జక్రాన్‌పల్లి మండలాలు వస్తాయి. దీంతో బోధన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డితో పాటు డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వినయ్ రెడ్డిలు సీనియర్ కాంగ్రెస్ నాయకులతో చర్చించి పార్టీ కోసం పని చేసే కార్యకర్తలను పదవులకు ఎంపిక చేశారు. చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు డైరెక్టర్లుగా చిన్నారెడ్డి(చేపూర్), బూస మల్లయ్య యాదవ్(మంథని), వూషన్న(మచర్ల), కల్లెం మల్లారెడ్డి(ఆలూర్), పింజ ఉషారాణి(ఆర్మూర్), ఫయాజ్(ఆర్మూర్), చంద్రశేఖర్‌రెడ్డి(పెర్కిట్), అమృత్‌రావు(అంకాపూర్), కనక రవి(తొర్లికొండ), పీర్ సింగ్(జక్రాన్‌పల్లి)తో పాటు ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్ దేవి లావణ్య, ఆర్మూర్ సొసైటీ చైర్మన్ సైతం డైరెక్టర్లుగా కొనసాగుతారు.

అనారోగ్యంతో కానిస్టేబుల్ మృతి



బాన్సువాడ రూరల్: పాత బాన్సువాడకు చెందిన పోలీస్‌కానిస్టేబుల్ గులెపల్లి సురేశ్ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. బీర్కూర్ పీఎస్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సురేశ్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కుటుంబీకులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కానిస్టేబుల్ మృతికి బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు సంతాపం తెలిపారు.

మద్యం మత్తులో ఆస్పత్రిపై దాడి

కామారెడ్డి టౌన్: మద్యం మత్తులో ఆస్పత్రిపై దాడి చేసి వీరంగం సృష్టించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. దోమకొండకు చెందిన ఓ వ్యక్తి కామారెడ్డిలో ఓ పత్రికలో విలేకరిగా కొనసాగుతున్నాడు. అతను మరో వ్యక్తితో కలిసి మద్యం మత్తులో జిల్లా కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఉన్న సమన్విత ఆస్పత్రిపై శుక్రవారం దాడి చేశారు. వైద్యుడు ప్రవీణ్‌కుమార్‌ను డబ్బులు ఇవ్వాలని బెదిరించారు. ఈ క్రమంలో వైద్యుడితో పాటు సిబ్బంది, ఇద్దరు ఆయాలపై దాడి చేసి, ఆస్పత్రి ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. వైద్యుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

ప్రీరిపబ్లిక్ దినోత్సవానికి వలంటీర్ల ఎంపిక

తెయూ(డిచ్‌పల్లి): వెస్ట్ జోన్ ముందస్తు రిపబ్లిక్ దినోత్సవం తెయూలో శుక్రవారం జరిగింది. కార్యక్రమానికి రిజిస్ట్రార్ యాదగిరి హాజరై వలంటీర్లు క్రమశిక్షణతో దేశభక్తి కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఎంపికైన వలంటీర్లు జాతీయ సమైక్యత లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఎన్ఎస్ఎస్ రీజినల్ డైరెక్టర్ శ్రీరామకృష్ణ హాజరై నిబంధనల ప్రకారం ఎత్తు, పరుగు పందెం, పరేడ్ చేయించి ఎంపిక చేపట్టారు. అనంతరం వలంటీర్ల విష పరిజ్ఞానంతోపాటు, గానం, నృత్యం భాషా నైపుణ్యాల ఆధారంగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త రవీందర్ రెడ్డి, ప్రోగ్రాం అధికారులు స్వప్న, స్రవంతి, వలంటీర్లు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

యువకుడి అదృశ్యం



ఖలీల్‌వాడి: నగరంలోని దారుగల్లీకి చెందిన షేక్‌మహబూబ్ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు రెండో టౌన్ ఎస్సై యాసిన్ అరాఫత్ శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రెండు రోజుల క్రితం రాత్రి 8 గంటలకు ఇంటి నుంచి వెళ్లిన మహబూబ్ తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. అతని మానసికస్థితి సరిగా లేదని తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సెల్‌టవర్ ఎక్కి వ్యక్తి హల్‌చల్



ఇందల్వాయి: మండలంలోని సిర్నాపల్లిలో తేలు నడిపి సాయిలు అనే వ్యక్తి తన భూసమస్యలు పరిష్కరించాలని శుక్రవారం ఉదయం గ్రామంలోని సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. ముగ్గురు అన్నదమ్ములకు చెందిన నాలుగు ఎకరాల భూమిలో తన పేరుమీద గుంట భూమి కూడా లేదని, తన అన్న ఒక్కడే రెండెకరాలు పట్టా చేసుకున్నాడని సాయిలు తెలిపాడు. అంతేకాకుండా తనపై దాడి చేశాడని పేర్కొన్నాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు టవర్‌పై ఉన్న సాయిలుతో ఫోన్లో మాట్లాడి సముదాయించారు. గ్రామానికి చేరుకున్న ఎస్సై మనోజ్ కుమార్ హామీ మేరకు సాయిలు టవర్ దిగాడు. అనంతరం సాయిలుని ఎస్సై తహసీల్దార్ వెంకట్రావు వద్దకు తీసుకెళ్లి సమస్యపై మాట్లాడారు. సరైన ఆధారాలు ధ్రువపత్రాలు తీసుకొస్తే న్యాయం జరిగేలా చూస్తానని తహసీల్దార్ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి



తాడ్వాయి: అనారోగ్యంతో ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన తాడ్వాయి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన రాకేశ్(22) కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ పాఠశాలల్లో బస్సు క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. రాకేశ్‌కు ఏడాది క్రితం వివాహమైంది. కాగా అతను రెండేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. కడుపునొప్పి భరించలేక ఈ నెల 4న పురుగుల మందు సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం ఎల్లారెడ్డిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

వృద్ధుడిని గాయపర్చిన నిందితుడి అరెస్ట్

ఖలీల్‌వాడి: నగరంలోని న్యూఎన్జీవో కాలనీలో వృద్ధుడిని కత్తితో గాయపర్చి బంగారం ఎత్తుకెళ్లిన నిందితుడిని అరెస్ట్ చేసినట్లు మూడో టౌన్ ఎస్సై మహేశ్ శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన చిందం సిద్ధిరాములు అనే వృద్ధుడి ఇంట్లోకి ఈనెల 16న గుర్తు తెలియని వ్యక్తి వచ్చి కత్తితో గాయపర్చి, అతని మెడలో ఉన్న రెండు తులాల బంగారు చైన్‌ని లాక్కొని ఆటోలో పారిపోయాడు. దీంతో వృద్ధుడు మనుమడు మనీష్ చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. టౌన్ సీఐ జి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో దర్యాప్తు చేయగా ఆటో నంబర్ ఆధారంగా వివరాలను సేకరించారు. దొంగతనానికి సహకరించిన ఆటో డ్రైవర్ కరీంను పట్టుకుని విచారించగా కత్తితో గాయపర్చి, చైన్ దొంగలించిన నజీమ్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. దీంతో వారి నుంచి రెండు సెల్ ఫోన్లు, ఆటో, కత్తి, రెండు తులాల బంగారు చైన్‌ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులను అరెస్టు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. దొంగతనం కేసును 24 గంటల్లో చేదించిన ఎస్సై మహేశ్‌తో పాటు సిబ్బందిని టౌన్ సీఐ జి శ్రీనివాసురాజు అభినందించారు.

పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరికి జైలు

రెంజల్: మద్యం మత్తులో డయల్100కు కాల్ చేసి న్యూసెన్స్ చేసిన ఇద్దరు యువకులకు శుక్రవారం బోధన్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఒక రోజు జైలు శిక్షతో పాటు రూ. 50 చొప్పున జరిమానా విధించినట్లు రెంజల్ ఎస్సై సాయన్న తెలిపారు. మండలంలోని నీలా గ్రామానికి చెందిన గోసుల సాయినాథ్, మమ్మాయి శివకుమార్ తాగిన మత్తులో డయల్100కు కాల్ చేసి పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని పేర్కొన్నారు. వారిని విచారించి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి శిక్ష విధించినట్లు తెలిపారు. ఎవరైనా మద్యం మత్తులో డయల్100కు కాల్ చేస్తే శిక్ష తప్పదని ఎస్సై హెచ్చరించారు.

చోరీ కేసులో మరో నిందితుడికి ఏడాది..

నందిపేట్: బైక్ చోరీకి పాల్పడిన ఘటనలో గోపాల వంశీ అనే నిందితుడికి ఆర్మూర్ జూనియర్ సివిల్ జడ్జి వేముల దీప్తి శుక్రవారం ఏడాది సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు నందిపేట ఎస్సై హరిబాబు తెలిపారు. సిద్దిపేట జిల్లా ఎరుకుడు గ్రామానికి చెందిన వంశీ నందిపేట పీఎస్‌లో గత ఏడాది బైక్‌ను చోరీ చేశాడు. అప్పటి ఎస్సై రాహుల్ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. కోర్టులో శుక్రవారం ఏపీపీ రామకృష్ణ కేసుకు సంబంధించిన సాక్షులను ప్రవేశ పెట్టారు. విచారణ అనంతరం నేరం రుజువు కాగా న్యాయమూర్తి నిందితుడికి జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు.

మిట్టాపూర్ శివారులో దారి దోపిడీ

నవీపేట: మండలంలోని మిట్టాపూర్ శివారులో బాసర రహదారిపై గుర్తు తెలియని దుండగులు గురువారం ఉదయం దారి దోపిడీకి పాల్పడ్డారు. శివతండాకు చెందిన నరేశ్‌కుమార్ వేకువజామున నాలుగున్నర ప్రాంతంలో బాసర వైపు బైక్‌పై వెళ్తుండగా ముగ్గురు దుండగులు మిట్టాపూర్ వద్ద అటకాయించారు. బైక్‌ను ఆపి భూతికదాడికి పాల్పడ్డారు. నరేశ్‌కుమార్ జేబులో ఉన్న రూ. 2500 నగదుతో పాటు సెల్‌ఫోన్‌ను లాక్కుని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్ పేర్కొన్నారు.

అర్గుల్‌లో చోరీ



జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్‌లో శుక్రవారం మధ్యాహ్నం మగ్గిడి గంగాధర్ ఇంట్లో చోరీ జరిగింది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. అర్గుల్‌కు చెందిన మగ్గిడి గంగాధర్ పని నిమిత్తం ఆర్మూర్‌కు వెళ్లాడు. ఆర్మూర్‌కు వెళ్లిన సమయంలో ఇంట్లో ఉన్న భార్య పక్కింటికి వెళ్లింది. ఆ సమయంలో దుండగులు ఇంట్లోకి ప్రవేశించి బెడ్‌రూం అల్మారాలో ఉన్న రూ. 4లక్షల నగదు, బంగారు నెక్లెస్, బంగారు తీగ సుమారు 5 తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. చుట్టుపక్కల వారిని అడిగితే ఓ గుర్తు తెలియని వ్యక్తి వారి ఇంటి నుంచి బయటకు వెళ్లాడని తెలిపారు. ఘటన స్థలాన్ని డిచ్‌పల్లి సీఐ మల్లేశ్ పరిశీలించారు. డాగ్ స్క్వాడ్ క్లూస్ టీం వచ్చి నమూనాలు సేకరించారు.